- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
10-11-2026

సంపుటి : 01 సంచిక :227 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 227 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

- 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిన పేదరికం
- తీవ్ర పేదరికం నుంచి బయటపడిన 49.6 కోట్ల మంది
- భారత్ పురోగతిని ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు
- పేదల్లో 57 శాతం మంది ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోనే
- 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరిన కుటుంబాల ఖర్చు

గత దశాబ్దంలో భారత్ పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. 2011లో 27.1 శాతంగా ఉన్న అత్యంత పేదరికం 2023 నాటికి 2.6 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ఈ కాలంలో దాదాపు 49.6 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల, మహిళలకు ఉద్యోగాలు, డిజిటల్ సంక్షేమ పథకాలు, గ్రామీణ రంగానికి మద్దతు ఈ మార్పునకు ప్రధాన కారణాలని పేర్కొంది. అయితే పేదరికం తగ్గుదల దేశవ్యాప్తంగా సమానంగా లేదని, ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న ప్రాంతంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నారని నివేదిక వివరించింది.



03



తెలంగాణలో జనగణనకు
ముహూర్తం ఖరారు

- జనవరి 25 నుంచి ఇంటింటి జనాభా లెక్కల సేకరణ
- ఫిబ్రవరి 28 వరకు కొనసాగనున్న ప్రధాన సర్వే
- జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ జనగణనకు అవకాశం
- జీవో ఎంఎస్ నెం.155 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్
- వివరాలను మరోసారి పరిశీలించి సవరణలు చేపట్టనున్న అధికారులు
- 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలు ప్రామాణిక తేదీ
- తెలంగాణ గెజిట్‌లో కేంద్ర జనగణన నోటిఫికేషన్ పునఃప్రచురణ

హైదరాబాద్ నవంబర్ 9(మహాప్రభ)
తెలంగాణలో జనగణన--2027 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన తేదీలను ప్రకటిస్తూ సోమవారం జీవో ఎంఎస్ నెం.155 జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 28 వరకు కొనసాగనుంది. నిర్దేశిత గడువులో జనగణనను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. జనగణనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు స్వీయ జనగణనకు కూడా అవకాశం కల్పించింది. జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు

-మిగతా 3 లో

ప్రజాబలంతో సునామీ సృష్టిస్తా!

ప్రజాబలంతో రాజకీయ సునామీ సృష్టించి ప్రత్యర్థులను ఎదుర్కొంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా 2028 డిసెంబర్ నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు తీసుకొచ్చి తీరుతానని, మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని హామీ ఇచ్చారు. సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో గ్రామగ్రామాన పర్యటిస్తానని లగచర్ల రైతు బహిరంగ సభలో ప్రకటించారు.


ఆసునామీలో రాజకీయ ప్రత్యర్థులంతా కొట్టుకుపోతారు: సీఎం రేవంత్‌రెడ్డి



- 2028 డిసెంబర్ నాటికి కొడంగల్‌కు కృష్ణా జలాలు తీసుకొస్తా
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం
- పాలమూరు ప్రజల రుణం తీర్చుకునే అవకాశం కల్పించిన కొడంగల్ ప్రజలు
- గత పాలకుల హయాంలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగలేదని విమర్శ
- అప్పులు చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కేటాయింపు
- సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' పేరుతో గ్రామగ్రామాన పర్యటన
- ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- లగచర్ల రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

/ దౌల్తాబాద్ / బొంరాస్‌పేట:నవంబర్ 9(మహాప్రభ)
ప్రజాబలంతో సునామీ సృష్టిస్తానని, ఆ సునామీలో రాజకీయ ప్రత్యర్థులంతా కొట్టుకుపోతారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ వచ్చినా, ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ వచ్చినా ఎదుర్కొంటానని వ్యాఖ్యానించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కొడంగల్‌కు కృష్ణా జలాలు తీసుకొచ్చి తీరుతానని స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి నియోజకవర్గంలోని భూములను

-మిగతా 3 లో



03

ఢిల్లీని కమ్మేసిన విషవాయువులు..

- దీపావళి తర్వాత ఢిల్లీలో తీవ్ర కాలుష్యం
- పలు ప్రాంతాల్లో 400 దాటిన ఏక్యూఐ
- 5 పర్యవేక్షణ కేంద్రాల్లో పీఎం2.5 డేటా గల్లంతు
- కాలుష్య గణాంకాలను దాచిపెడుతున్నారంటూ కాంగ్రెస్ ఆరోపణ
- కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ 3,000 దాటిందన్న ఆప్ నేత
- కాంగ్రెస్, ఆప్ పాలనలో కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోలేదన్న బీజేపీ
- కాలుష్య డేటాపై బీజేపీ, విపక్షాల ఫైట్!

నెదర్లాండ్స్‌లో 2 లక్షల మంది నిరసనలు



03



03

కొత్త పాస్‌పోర్టు ఇవ్వండి

- బంగ్లాదేశ్‌ను కోరిన హసీనా!
- కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని విజ్ఞప్తి
- ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు న్యాయవాది ద్వారా ఈమెయిల్
- హసీనా దరఖాస్తుల ప్రామాణికతను పరిశీలిస్తున్నట్లు హోంమంత్రి వెల్లడి
- హసీనా అభ్యర్థనను హాస్యాస్పదంగా అభివర్ణించిన విదేశాంగ శాఖ సహాయ మంత్రి
- అప్పగింత ఒప్పందం ప్రకారం భారత్‌ను కోరాలని సూచన

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

- ఏపీ, తెలంగాణలో వర్షాలు!
- ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన
- తెలంగాణలో క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత, పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కోస్తాంధ్ర, రాయలసీమలో ఉరుములతో కూడిన వర్షాలు!
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం
- భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడి



03

తెలంగాణలో అప్పుడే ఎన్నికల వేడి!

అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్ల
ముందే ప్రధాన పార్టీల వ్యూహాలు

- మూడేళ్ల కాంగ్రెస్ పాలన నేపథ్యంలో రాజకీయ సమీకరణాల్లో మార్పులు
- అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు
- హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి
- తెలంగాణలో పట్టు సాధించేందుకు బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రణాళికలు
- పార్టీ పునర్నిర్మాణానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శ్రీకారం
- కేటీఆర్, హరీశ్‌రావుకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం
- నియోజకవర్గాల వారీగా ప్రజా సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ కార్యాచరణ



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:నవంబర్ 9(మహాప్రభ)
తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందే వేడి రాజుకుంటోంది. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో మిగిలిన రెండేళ్లలో ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారిస్తున్నారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీలు తమదైన కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పార్టీల అంతర్గత సమీకరణాలు, నాయకత్వ వ్యూహాలు, రాజకీయ పోరాటాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

-మిగతా 3 లో



03

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ఈసీ కసరత్తు ముమ్మరం

- జనవరిలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవకాశం
- ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవాలో ఎన్నికలు
- సీఎస్‌లు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు
- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పర్యటించిన డిప్యూటీ ఎన్నికల కమిషనర్ బృందాలు
- నవంబర్ నెలాఖరులోగా నివేదికలు సమర్పించే అవకాశం
- చిన్న రాష్ట్రాల్లో ఒకే దశ.. యూపీలో బహుళ దశల్లో పోలింగ్‌కు సూచనలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి

- కరీంనగర్‌లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సంయుక్తంగా ప్రారంభం
- ప్రభుత్వాల మధ్య సమన్వయంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్న బండి
- డంప్ యార్డు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని మంత్రుల హామీ
- అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించవద్దని బండి సంజయ్ హెచ్చరిక
- కాంట్రాక్టర్లను భయపెడితే పనులు ముందుకు సాగవని వ్యాఖ్య
- ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత ప్రజా సంక్షేమమే లక్ష్యమన్న పొన్నం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:నవంబర్ 9(మహాప్రభ)
కరీంనగర్ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి పనులకు కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ

-మిగతా 3 లో

ఈ నెల 13న యుగాంతం ?

-శాస్త్రవేత్తలు 1960, 1964లలో వేసిన అంచనాలు నిజమవుతాయా?

-ఆశాజనకంగా ప్రస్తుత పరిస్థితులు

న్యూఢిల్లీ:నవంబర్ 9(మహాప్రభ)

మూడు రోజుల్లో ప్రపంచం అంతం కాబోతున్నదా? 1960 నాటి జోస్యం నిజమవుతుందా? అనే విషయాలు తాజాగా చర్చనీయాంశం అయ్యాయి. జనాభా పెరిగిపోతే, ప్రజలకు తగినంత ఆహారాన్ని అందించే స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగబోవని, ఆకలి చావులు పెరుగుతాయని శాస్త్రవేత్తలు 1960వ దశాబ్దంలో ఆందోళన వ్యక్తం చేశారు. "డూమ్స్‌డే : ఫ్రైడే 13 నవంబర్ 2026" శీర్షికతో 'సైన్స్'లో ప్రచురితమైన వ్యాసంలో, 2026 నవంబర్ 13నాటికి మానవ జనాభా అనంతం అవుతుందని ప్రొఫెసర్ హీంజ్ వోన్ ఫోర్‌స్టెర్ బృందం చెప్పింది.జనాభా ఎంత వేగంగా పెరిగినప్పటికీ, ఫుడ్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ సైన్స్ కూడా అదే వేగంతో



అభివృద్ధి చెందుతాయని ఫోర్‌స్టెర్ వాదించారు. ఆయన గణిత సూత్రాల ఆధారంగా డూమ్స్‌డేను లెక్కించగా, జియాలజిస్ట్ డాక్టర్ మైఖేల్ టెక్లా మాత్రం సూర్యుడి నుంచి మునుపెన్నడూ లేనంత తీవ్రమైన శక్తి 2026 నవంబర్ 13న విడుదలవుతుందని, భూమి అయస్కాంత క్షేత్రంలో తీవ్రమైన అంతరాయాలు ఏర్పడతాయని, ఫలితంగా భూమిపై విపరీతమైన విధ్వంసం జరుగుతుందని చెప్పారు.

3 కారణాలు ఆశాజనకం

13వ తారీఖు వచ్చేస్తోందనే ఆందోళన అక్కర్లేదని చెప్పడానికి 3 కారణాలు ఉన్నాయి. వాటిలో మొదటిది, ఫోర్‌స్టెర్ కేవలం గణిత సూత్రాన్ని మాత్రమే చెప్పారు. ప్రస్తుతం అది నిజమవడం అసాధ్యం. రెండో కారణం ఏమిటంటే, డాక్టర్ మైఖేల్ చెప్పినదాంట్లో చాలా లోపాలు ఉన్నాయి. సూర్యుడిలో తరచూ అసాధారణ కార్యకలాపాలు జరుగుతూ ఉంటాయి. కేవలం ఒక రోజులో మొత్తం భూమిని నాశనం చేసే స్థాయిలో అవి ప్రమాదకరం కాదు. మూడో కారణం ఏమిటంటే, విశ్వాన్ని శాటిలైట్స్ నిరంతరం గమనిస్తూ ఉంటాయి. ఏదైనా అసాధారణమైన ఖగోళ సంఘటన జరగబోతూ ఉంటే, దానిని ముందుగానే గుర్తించవచ్చు.

సారంగం తప్పి ఆడ పులి పరారీ



కోల్‌కతా నవంబర్ 9(మహాప్రభ)

పశ్చిమ బెంగాల్‌లోని బక్సా పులుల అభయారణ్యం నుంచి ఓ ఆడ పులి సొంతంగా సారంగాన్ని తప్పుకుని పరారయ్యింది. అటవీ శాఖాధికారుల కథనం ప్రకారం, 13 రోజుల అన్వేషణ అనంతరం ఈ నెల 3న ఆ పులిని అస్సాంలోని రైమోనా పులుల అభయారణ్యం సమీపంలో గుర్తించి, ఈ నెల 4న తిరిగి బక్సాకు తీసుకొచ్చారు. ఐదు రోజుల అనంతరం ఆ ఆడ పులి కట్టుదిట్టమైన నిఘా నుంచి తప్పించుకుని మళ్లీ పరారైంది. ఆ పులి అస్సాం అడవుల్లోని మగ పులితో అనుబంధం ఏర్పరచుకుని ఉండవచ్చునని అటవీ శాఖాధికారులు భావిస్తున్నారు. పరారైన పులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పాల ధరల పెంపుతో
స్వీట్ల ధరలకు రెక్కలు

ఏడాది వ్యవధిలో 17% పెరుగుదల



న్యూఢిల్లీ:నవంబర్ 9(మహాప్రభ)

దేశవ్యాప్తంగా పాల ధరలు భారీగా పెరగడంతో ఈ దీపావళి స్వీట్లు ప్రియమయ్యాయి. గత ఏడాది కాలంలో డెయిరీ సంస్థలు పాల ధరలను 17 శాతం వరకు పెంచాయి. ఫలితంగా పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, ఐస్‌క్రీమ్ వంటి ఉత్పత్తుల ధరలు కూడా పెరిగాయి. ముఖ్యంగా పండుగల సమయంలో స్వీట్లకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశంలోని ప్రధాన నగరాల్లో వాటి ధరలు 15 నుంచి 30 శాతం వరకు పెరిగాయి. పాల ధరల పెరుగుదలకు ఐస్‌క్రీమ్ తయారీ సంస్థల ముందస్తు నిల్వలు కూడా ఒక కారణంగా మారాయి. మరోవైపు ముడి చమురు ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు అధికమయ్యాయి. పశువుల దాణాకు ఉపయోగించే మక్కజొన్న ఆధారిత పశువుల మేత ధరలు 75 శాతం పెరిగాయి. ఈ భారాన్ని డెయిరీ సంస్థలు వినియోగదారులపై మోపుతున్నాయి. ప్రపంచ పాల ఉత్పత్తిలో భారత్ వాటా 25 శాతం ఉన్నప్పటికీ, ఉత్పత్తి వ్యయాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయి.

క్యాన్సర్ మందుల
తగ్గిన ధరలు అమల్లోకి

పాత ధర చెల్లించాలని అడిగితే ఫిర్యాదు చేయవచ్చు



న్యూఢిల్లీ:నవంబర్ 9(మహాప్రభ)

క్యాన్సర్ చికిత్స కోసం ఉపయోగించే 137 మందుల ధరలు సోమవారం నుంచి తగ్గాయి. 679 బ్రాండ్ల ఔషధాల ధరలు 50 శాతానికి పైగా తగ్గాయి. అత్యధిక తగ్గుదల 96.45 శాతం. ఫలితంగా, వినియోగదారులకు సంవత్సరానికి రూ.3,540.38 కోట్లు ఆదా అవుతుంది. క్యాన్సర్ మందుల సవరించిన గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)ను నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) వెబ్‌సైట్ nppa.gov.iఅ లో లేదా Pharma Sahi Daam మొబైల్ యాప్‌లో చూడవచ్చు. ఈ ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ సొమ్మును కెమిస్ట్ లేదా హాస్పిటల్ ఫార్మసీ వసూలు చేయకూడదు. అధిక ధరలను వసూలు చేసినా, ధరలకు సంబంధించిన ఇతర ఫిర్యాదులు ఉన్నా, వినియోగదారులు Pharma Jan Samadhan portal ద్వారా లేదా ఎన్‌పీపీఏ హెల్ప్‌లైన్ నంబర్ 1800-111-255కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

బాలుడిని చంపి.. అవయవాలు అమ్మేందుకు యత్నం

రాయ్‌పూర్ నవంబర్ 9(మహాప్రభ)



ఛత్తీస్‌గఢ్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. నాలుగేండ్ల బాలుడిని చంపి అవయవాలు అమ్మేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. జష్‌పూర్ జిల్లాలోని సన్నా గ్రామానికి 2025లో రామ్‌జీత్ వలసవచ్చి ఓ గుడిసెలో నివసిస్తున్నాడు. అతని నాలుగేండ్ల కొడుకును వరుసకు మేనమామ అయ్యే చల్నీ గ్రామానికి చెందిన గౌర్‌ప్రాత్ బసుదేవ్ ఇంటికి తరచూ వెళ్లుండేవాడు.నవంబర్ 5 నుంచి బాలుడు కనిపించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బసుదేవ్ మీద అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తానే చంపేసినట్లు అంగీకరించాడు. బాలుడిని చంపేసి ఊపిరితిత్తులు, కిడ్నీలు, కండ్లు అమ్మేందుకు ప్రయత్నించానని తెలిపాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకే ఇలా చేశానన్నాడు. బాలుడి మృతదేహాన్ని ఓ నీటిగుంతలో పూడ్చిపెట్టినట్లు పోలీసులు గుర్తించి వెలికి తీశారు.

పండుగ వేళ విషాదాలు.. 23 మంది మృతి

దేశవ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు.. వందల మందికి గాయాలు

హైదరాబాద్‌లో దీపావళి వేడుకల్లో 60 మందికి కంటి గాయాలు



న్యూఢిల్లీ నవంబర్ 9(మహాప్రభ)

దీపావళి పండుగ అనేక ఇండ్లలో విషాదాలు నింపింది. అగ్ని ప్రమాదాలు, పటాకులు పేలుళ్లు, చేతులు, ముఖాల మీద బాంబులు పేలడంతో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన వేర్వేరు ఘటనల్లో రెండు కుటుంబాలకు చెందిన 12 మంది చనిపోయారు. ఢిల్లీలో చేతిలోనే పటాకులు పేలి పదేండ్ల బాలుడు చనిపోయాడు.

హైదరాబాద్‌లో 60 మందికి కంటిగాయాలు..

హైదరాబాద్‌లో పటాకుల ప్రమాదాల వల్ల 60 మందికి కంటిగాయాలయ్యాయి.

మహారాష్ట్రలో ఏడుగురు మృతి..

మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో కిరాణా దుకాణం ఉన్న ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మరణించారు. ఖండ్‌వాలా ప్రాంతంలో పటాకులు పేలి మరొకరు చనిపోయారు.

తమిళనాడులో 4వేల మందికి గాయాలు..

తమిళనాడు వ్యాప్తంగా నవంబర్ 7 నుంచి 9 వరకు దీపావళి వేడుకల్లో భారీగా ప్రమాదాలు జరిగాయి. ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ నివేదిక ప్రకారం మూడురోజుల్లో 4,098 మంది వివిధ ప్రమాదాల్లో గాయపడి దవాఖానల్లో చేరారు. ఇందులో ఇద్దరు మరణించారు. రాజస్థాన్‌లోని బుండీలో టపాసులు కాలుస్తుండగా 12 ఏండ్ల బాలుడు సజన్ తీవ్రగాయాలై చనిపోయాడు.

ముంబైలో బాణసంచాపై నిషేధం..


ముంబైలో వరుస ప్రమాదాల నేపథ్యంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నవంబర్ 25 వరకు నగరంలో రాకెట్ టపాకులు, ఆకాశంలోకి ఎగిరే టపాకులు కాల్చడంపై నిషేధం విధించారు.

బెంగాల్‌లో ఈసీ టార్గెట్ ముస్లిం ఓటర్లే!

-తొలగించిన 10 పేర్లలో 9 మంది ముస్లింలే

-16,08,175 మందికి వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లు

-14,39,797 మంది ముస్లిం ఓటర్ల మెడపై ఈసీ కత్తి



కోల్‌కతా, నవంబర్ 9(మహాప్రభ)

న్యాయాధికారులు అర్హులుగా గుర్తించినప్పటికీ భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని చూస్తున్న పశ్చిమ బెంగాల్ ఓటర్లలో ప్రతి 10 మందిలో 9 మంది కి ముస్లిం పేర్లు ఉన్నాయి. ఈ పరిస్థితి రాష్ట్రంలోని ముస్లిం మెజారిటీ సరిహద్దు ప్రాంతాల్లోనే కాకుండా, హిందూ మెజారిటీ జిల్లాల్లో కూడా కనిపిస్తున్నది. సివిక్ రిసెర్చ్ గ్రూప్ సంకలనం చేసిన అప్పీల్ రికార్డుల ప్రకారం ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) సమయంలో న్యాయమూర్తులు అర్హులుగా ప్రకటించిన ఓటర్లను చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ 16,08,175 అప్పీళ్లు దాఖలయ్యాయి. వారిలో కనీసం 14,39,797 మంది అంటే 89.5 శాతం మందికి ముస్లిం పేర్లు ఉన్నాయని 'ది వైర్' జరిపిన ఓటర్ల పేర్ల విశ్లేషణలో తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం పశ్చిమ బెంగాల్ జనాభాలో ముస్లింలు 27 శాతం మంది ఉన్నారు. అలాగే రాష్ట్రంలోని ఓటర్లలో వీరు సుమారు 29 శాతం ఉన్నారు.

అన్ని సీట్లలో ఒకే తీరు

మైనారిటీ జనాభా వాటా ఆధారంగా నియోజకవర్గాలను వర్గీకరించడం ద్వారా మైనారిటీ ఓటర్లు తమ చుట్టూ ఉన్న జనాభా నుంచి ఎంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారో ఈ లెక్కలు తెలుపుతాయి. జనాభాలో ముస్లింలు సుమారు 6 శాతం ఉన్న నియోజకవర్గాలలో వ్యతిరేకంగా అప్పీల్ చేసిన ప్రతి 10 మంది ఓటర్లలో ఆరుగురి కంటే ఎక్కువ మందికి ముస్లిం పేర్లు ఉన్నాయి. ఇది వారి జనాభా కంటే దాదాపు పది రెట్లు ఎక్కువ. మైనారిటీలు సుమారు 15 శాతం ఉన్న నియోజకవర్గాలలో ఈ సంఖ్య 10 పది మందిలో 8 కంటే ఎక్కువగా ఉంది. 137 నియోజకవర్గాలలో అభ్యంతరాలు దాఖలైన ఓటర్లలో కనీసం 90 శాతం మందికి ముస్లిం పేర్లు ఉన్నాయి.

దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ కౌంటర్



న్యూఢిల్లీ:నవంబర్ 9(మహాప్రభ)

ప్రధాని మోదీ ఆదివారం తన దీపావళి వేడుకలను చత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ జిల్లాలో జరుపుకున్న విషయం తెలిసిందే. అక్కడ ఆయన సీఆర్పీఎఫ్ జవాన్లతో మాట్లాడుతూ దేశంలో సాయుధ నక్సల్స్ అంతం అయ్యారని, కానీ దిమాగీ నక్సల్స్ మాత్రం సంస్థల్లో, రాజకీయ పార్టీల్లో ఉన్నారంటూ ఆరోపించారు. అయితే ఆ వ్యాఖ్యలకు ఇవాళ విపక్ష నేత రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో ఓ పోస్టు పెట్టారు. ప్రియమైన సీఆర్పీఎఫ్ జవానులారా.. ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పారని, అది మీ ముఖంలో కనిపించిందన్నారు. మనల్ని ప్రధాని మోదీ నక్సల్స్ అని పిలిచారని ఆరోపించారు. కానీ ఈ అంశంలో తన ఛాలెంజ్ మారదన్నారు. ఎవరు దేశ వ్యతిరేకులో తేల్చేందుకు ప్రధాని తనతో చర్చకు రావాలన్నారు. విదేశీ శక్తులు ఎవర్ని నియంత్రిస్తున్నాయో తెలుస్తాయన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా ఈ అంశంపై చర్చిస్తానని రాహుల్ సవాల్ చేశారు. ఆ చర్చ ముగిసిన తర్వాత .. జవాన్ల ముందు మోదీ తల ఎత్తుకుని నిలబడలేరని గ్యారెంటీ ఇస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

కిడ్నీలు ఫెయిల్ అంటూ తప్పుడు రిపోర్టులు

వైద్యులు, ల్యాబ్‌ల మూకుమ్మడి దందా



లక్నో:నవంబర్ 9(మహాప్రభ)

బీజేపీపాలిత ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో అక్రమ బాగోతం వెలుగు చూసింది. పలు పాథాలజీ ల్యాబ్‌లలో అక్రమాలను 'దైనిక్ భాస్కర్' తన పరిశోధనలో బయటపెట్టింది. ఆరోగ్యంగా ఉన్న కిడ్నీలు, కాలేయం దెబ్బతిన్నట్లు, సాధారణ జ్వరాన్ని డెంగ్యూ, మలేరియా వంటి తీవ్రమైన వ్యాధులుగా చూపిస్తూ తప్పుడు రిపోర్టులు తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. వైద్యులు, ల్యాబ్ నిర్వాహకులు, శాంపిల్ కలెక్షన్ ఏజెంట్లు కలిసి ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.ఓ ల్యాబ్‌లో సాధారణంగా ఉన్న ప్లేట్‌లెట్స్ సంఖ్యను 1.74 లక్షల నుంచి 1.10 లక్షలకు తగ్గించి రిపోర్టు ఇచ్చారు. అహ్మద్ అన్సారీ అనే నిర్వాహకుడు కిడ్నీ పరీక్షలో సాధారణంగా ఉన్న క్రియాటినిన్ స్థాయిని 0.58 నుంచి 8.1గా మార్చాడు. మరో ల్యాబ్ నిర్వాహకుడు టీఎల్‌సీ స్థాయిని 15,600గా చూపించాడు. అసలు రిపోర్టులు మాత్రం సాధారణంగానే ఉన్నాయి. కేజీఎంయూ వంటి ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి రోగులను ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తే ఒక్కొక్కరికిపై రూ.4 వేల కమిషన్ వస్తుందని, గోరఖ్‌పూర్ నుంచి వచ్చే రోగులతో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వ్యాపారం చేయవచ్చని మరో నిర్వాహకుడు ప్రతిపాదించాడు. రోగులను ఎక్కువ రోజులు దవాఖానాలలో ఉంచి చికిత్స పేరుతో భారీగా వసూలు చేయడమే దీని వెనుక ఉద్దేశమని తేలింది.

సియాటెల్‌లో దీపావళి వేడుకకు అంతరాయం

హిందువులను బహిష్కరించాలంటూ గూండాగిరి



న్యూఢిల్లీ, నవంబర్ 9(మహాప్రభ)

హిందువులను దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ అతివాద ఇన్‌ఫ్లూయన్సర్ జేక్ లాంగ్ నేతృత్వంలో మితవాద గూండాలు ప్లకార్డులు ధరించి సియాటెల్‌లో దీపావళి వేడుకలకు అంతరాయం కలిగించారు. ఈ ఘటనను అమెరికా చట్టసభ సభ్యులు, సామాజిక నాయకులు వెంటనే ఖండించారు. శనివారం ఒక నృత్య ప్రదర్శన జరుగుతున్న వేదిక ముందు లాంగ్, అతని సహచర ఆందోళకారుడు థామస్ అలెన్ అమెరికా జెండాలను ఊపుతూ హిందువులు అందరినీ దేశం నుంచి బహిష్కరించండి, క్రైస్తవుల స్థానాన్ని హిందువులతో భర్తీ చేయడం ఆపండి అనే నినాదాలు ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. సియాటెల్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో ఈ అంతరాయానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రజాబలంతో సునామీ సృష్టిస్తా!

మొదటి తరువాయి

సాగునీటితో సస్యశ్యామలం చేస్తానని హామీ ఇచ్చారు. సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' కార్యక్రమంతో గ్రామగ్రామాన పర్యటిస్తానని ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గంలో మూడు రోజుల రైతు మేళా సందర్భంగా దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి లగచర్లలో ఏర్పాటు చేసిన రైతు బహిరంగ సభకు ప్రజల మధ్య పాదయాత్రగా చేరుకున్నారు. అంతకుముందు నియోజకవర్గంలో రూ.9,053 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొత్వాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2, రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.118.80 కోట్లతో పది తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో వ్యవసాయ కళాశాల, రూ.41.83 కోట్లతో ఆధునిక బస్టాండ్లు, ఇతర మౌలిక వసతుల పనులకు కూడా శంకుస్థాపనలు చేశారు. సభలో సీఎం మాట్లాడుతూ బూర్గుల రామకృష్ణారావు తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎంతోమంది నాయకులు, ముఖ్యమంత్రులు పనిచేసినా పాలమూరు భవిష్యత్తు మారలేదని అన్నారు. సాగునీరు లేక వేలాది కుటుంబాలు బతుకుదెరువు కోసం బొంబాయి వంటి ప్రాంతాలకు వలస వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో పూర్తికాలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ ప్రాంతానికి సాగునీరు అందుతుందని, వలసలు ఆగుతాయని ఆశించిన పాలమూరు ప్రజలకు గత పదేళ్ల పాలనలో నిరాశే ఎదురైందని ఆరోపించారు. కొడంగల్ ప్రజల అభిమానంతో పాలమూరు జిల్లా రూపురేఖలు మార్చే అవకాశం తనకు లభించిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నేల బిడ్డగా ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాంతాల్లో వలసలను నివారించాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రాంతం సస్యశ్యామలమవుతుందని, అందుకే ప్రతిపక్షాలు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఎన్ని కుట్రలు, అడ్డంకులు ఎదురైనా పథకం పూర్తయ్యే వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. కొడంగల్‌కు సాగునీరు వస్తే ప్రతిపక్షాలకు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా భారంగా మారిందని ముఖ్యమంత్రి విమర్శించారు. అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. అప్పులు చేసి, అబద్ధాలు చెప్పే అలవాటు తనకు లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. కొడంగల్ ప్రాంతంలో ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా ఈ పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

-27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిన పేదరికం
-తీవ్ర పేదరికం నుంచి బయటపడిన 49.6 కోట్ల మంది
-భారత్ పురోగతిని ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు
-పేదల్లో 57 శాతం మంది ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోనే
-2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరిన కుటుంబాల ఖర్చు

న్యూస్ డెస్క్:



భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు భారత్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని ఓ నివేదిక వెల్లడించింది. 2011లో దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 27.1 శాతంగా ఉండగా.. 2023 నాటికి అది 2.6 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. 'ది బిజినెస్ స్టాండర్డ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 49.6 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటపడేసింది. అమెరికా, రష్యా దేశాల మొత్తం జనాభా కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో పేదరికం అత్యంత వేగంగా తగ్గిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని నివేదిక పేర్కొంది. రోజుకు 4.2 డాలర్ల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకునే దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక ప్రమాణం ప్రకారం కూడా భారత్‌లో పేదరికం 2011లో 57.7 శాతం ఉండగా.. 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. అయితే పేదరికాన్ని కొలిచే విధానాల్లో వచ్చిన మార్పులు కూడా ఈ గణాంకాలపై కొంత ప్రభావం చూపి ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గుదల ఒకేలా లేదని నివేదిక తెలిపింది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న ప్రాంతంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నట్లు వెల్లడించింది. పేదరికం తగ్గడానికి ప్రధానంగా ఆర్థిక వృద్ధి, వినియోగం పెరగడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం, సామాజిక భద్రతా పథకాలు దోహదపడ్డాయని నివేదిక వివరించింది. 2022-25 మధ్య భారత్ సగటున ఏటా 7 శాతానికి పైగా ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. 2015లో 1.24 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న కుటుంబాల ఖర్చు 2025 నాటికి 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం కూడా పేదరికం తగ్గుదలకు తోడ్పడింది. 2014-24 మధ్య దేశంలో 17 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు నివేదిక పేర్కొంది. సగటున ఏటా 1.7 కోట్ల ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగిత రేటు 2015లో 7.6 శాతంగా ఉండగా.. 2025 నాటికి 4.2 శాతానికి తగ్గింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో డిజిటల్ విధానాల విస్తరణ, మహిళా కేంద్రిత పథకాలు, వ్యవసాయం, గ్రామీణ రంగాలకు మద్దతు, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ కూడా పేదరిక నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయని నివేదిక వివరించింది.

తెలంగాణలో జనగణనకు ముహూర్తం ఖరారు

మొదటి తరువాయి

చేసుకోవచ్చు. ఇంటింటి సర్వే ప్రారంభానికి ముందే ఈ వెసులుబాటును వినియోగించుకుని తమ వివరాలను అందించవచ్చు. అనంతరం జనవరి 25 నుంచి జనగణన సిబ్బంది ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారు. ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రధాన జనగణన ప్రక్రియ పూర్తయిన తర్వాత మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నారు. ఈ దశలో ఇప్పటికే సేకరించిన వివరాలను మరోసారి పరిశీలించి, అవసరమైన సవరణలు చేపడతారు. జనగణన--2027కు సంబంధించి మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జనగణన నోటిఫికేషన్‌ను తెలంగాణ గెజిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రచురించింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలో జనగణన నిర్వహణ తేదీలు, కార్యాచరణను అధికారికంగా ప్రకటించడంతో ప్రక్రియకు సంబంధించిన సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

నెదర్లాండ్స్‌లో 2 లక్షల మంది నిరసనలు

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలు ఆపాలంటూ డిమాండ్



ఆమ్‌స్టర్‌డమ్

నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డమ్‌లో 2 లక్షల మంది ఆదివారం రోడ్ల మీదకొచ్చి నిరసనలు తెలిపారు. వీరంతా ఎరుపు రంగు దుస్తులు వేసుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. గాజాలో ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న సైనిక చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఇజ్రాయెల్‌పై కఠినంగా వ్యవహరించాలని, నెదర్లాండ్స్ ప్రభుత్వం ఆయుధాల విక్రయాలను ఆపేయాలంటూ ఒత్తిడి తెచ్చారు.

ఢిల్లీని కమ్మేసిన విషవాయువులు..

న్యూఢిల్లీ



దీపావళి వేడుకల తర్వాత దేశ రాజధాని ఢిల్లీ విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతోంది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్ర స్థాయికి పడిపోయింది. ఈ పరిస్థితిపై అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య మాటల యుద్ధం మొదలైంది. కాలుష్య తీవ్రతను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా.. 25 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఆప్ చేసిందేమీ లేదని బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఆదివారం రాత్రి 11.05 గంటలకు ఢిల్లీ సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 373గా నమోదైంది. అలీపూర్, బవానా, బురారీ, చాందినీ చౌక్, ముండ్కా, పంజాబీ బాగ్, రోహిణి, వివేక్ విహార్ ప్రాంతాల్లో ఏక్యూఐ 400 దాటింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగ కారణంగా వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కాలుష్యాన్ని కొలిచే పర్యవేక్షణ కేంద్రాలు కీలక సమయంలో డేటా చూపకపోవడంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అనుమానాలు వ్యక్తం చేశారు. ఢిల్లీలోని 39 కేంద్రాల్లో 25 చోట్ల నవంబర్ 9 తెల్లవారుజామున 2 నుంచి 3 గంటల మధ్య పీఎం2.5 వివరాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. కాలుష్య గణాంకాలను ప్రభుత్వం కావాలనే దాచిపెడుతోందా? పరికరాల సామర్థ్యాన్ని మించిన స్థాయిలో కాలుష్యం నమోదైందా? అని ప్రశ్నించారు. డేటా కనిపించకపోవడం వల్ల కాలుష్యం మాయమైపోదని వ్యాఖ్యానించారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీపావళి రాత్రి కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ 3,000 దాటిందని ఓ వీడియోను ప్రస్తావించారు. మరోవైపు బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ విపక్షాల ఆరోపణలను తప్పుబట్టారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 10 ఏళ్లు ఢిల్లీని పాలించినా కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. హిందూ పండుగలు వచ్చినప్పుడే విపక్షాలు కాలుష్యాన్ని ప్రస్తావిస్తున్నాయని ఆరోపించారు.

కొత్త పాస్‌పోర్టు ఇవ్వండి..

-బంగ్లాదేశ్‌ను కోరిన హసీనా!
-కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని విజ్ఞప్తి
-ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు న్యాయవాది ద్వారా ఈమెయిల్
-హసీనా దరఖాస్తుల ప్రామాణికతను పరిశీలిస్తున్నట్లు హోంమంత్రి వెల్లడి
-హసీనా అభ్యర్థనను హాస్యాస్పదంగా అభివర్ణించిన విదేశాంగ శాఖ సహాయ మంత్రి
-అప్పగింత ఒప్పందం ప్రకారం భారత్‌ను కోరాలని సూచన

న్యూస్ డెస్క్:



స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అక్కడి ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమె.. స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని తన న్యాయవాది ద్వారా ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు సమాచారం. హసీనా పార్టీ అవామీ లీగ్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. లండన్‌లోని మ్యాట్రిక్స్ ఛాంబర్స్‌కు చెందిన తన న్యాయ ప్రతినిధుల ద్వారా కూడా ఆమె బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపింది. హసీనా సమర్పించిన దరఖాస్తుల ప్రామాణికత, వాటిపై ఉన్న చట్టపరమైన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని బంగ్లాదేశ్ హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ వెల్లడించినట్లు అధికారిక వార్తా సంస్థ బీఎస్ఎస్ పేర్కొంది. ఈ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే హక్కు ఆమెకు ఉందా లేదా అనే విషయాన్ని విదేశాంగ, న్యాయశాఖలు పరిశీలిస్తున్నాయని మంత్రి తెలిపారు. మరోవైపు హసీనా విజ్ఞప్తిని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కొబిర్ హాస్యాస్పదమైనదిగా అభివర్ణించారు. ఆమెకు మరణశిక్ష విధించబడిందని, ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ పాస్‌పోర్టులు జారీ చేయదని వ్యాఖ్యానించారు. నిజంగానే స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే అప్పగింత ఒప్పందం ప్రకారం తనను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను కోరాలని సూచించారు.

తెలంగాణలో అప్పుడే ఎన్నికల వేడి!

మొదటి తరువాయి

మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై వరుస సమీక్షలు నిర్వహిస్తూ పెండింగ్ అంశాలను పరిష్కరించే దిశగా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మద్దతు పెంచుకోవాలని నాయకత్వం భావిస్తోంది. ప్రభుత్వ పరిపాలనతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయడం, అవసరమైన సంస్థాగత మార్పులు చేపట్టడంపైనా అధిష్ఠానం దృష్టి పెట్టింది. మంత్రివర్గంలో మార్పులు ఉండవచ్చనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతోంది. డిసెంబరులో కొన్ని కీలక రాజకీయ నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇక తెలంగాణలో రాజకీయంగా బలపడటంపై బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు జాతీయ స్థాయి నేతలు రాష్ట్రంలో పర్యటించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇటీవల హైదరాబాద్ పర్యటనలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం, కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. జాతీయ నాయకుల వరుస పర్యటనలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపి, రాష్ట్రంలో రాజకీయంగా పట్టు సాధించాలని బీజేపీ భావిస్తోంది.

మరోవైపు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీని తిరిగి క్రియాశీలం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ మూడేళ్ల పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పార్టీ ముఖ్య నేతల సమావేశాల్లో ఆయన అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిని రాజకీయంగా అనుకూలంగా మలుచుకునేందుకు పార్టీ నిర్మాణంలో మార్పులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ వాణిని బలంగా వినిపించే నాయకులను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్న స్తబ్ధతను తొలగించడంపై దృష్టి సారిస్తున్నారు.

పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులు స్థానిక సమస్యలపై ప్రజలతో మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. క్షేత్రస్థాయి నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ధర్నాలు, నిరసనలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ భావిస్తోంది. నియోజకవర్గాల వారీగా సమస్యలను గుర్తించి వాటిపై ఉద్యమాలు చేపట్టేలా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని యోచిస్తోంది. నాయకులు, కార్యకర్తలను మళ్లీ ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లి పార్టీకి పూర్వపు రాజకీయ బలాన్ని తీసుకురావాలన్నది కేసీఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే ఈ కార్యాచరణ క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతుంది? ప్రజల మద్దతును తిరిగి పొందడంలో బీఆర్ఎస్ ఎంతవరకు విజయవంతమవుతుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్ల ముందే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు రాజకీయ సమరానికి సిద్ధమవుతుండటంతో తెలంగాణలో ఎన్నికల వాతావరణం ఇప్పటి నుంచే కనిపిస్తోంది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

న్యూఢిల్లీ



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మరోవైపు, తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. సాయంత్రం 5:30 తర్వాత చలి గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-16 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణం కన్నా 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న రోజుల్లో వర్ష సూచనలు ఉన్నాయి. సోమవారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కూడా వీయొచ్చు. తెలంగాణలోనూ అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడొచ్చని, సోమవారం తర్వాత వాతావరణం పొడిగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత దాని కదలిక, తీవ్రతను బట్టి వర్షాల ప్రభావంపై స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, చలి నుంచి, ఆకస్మిక వర్షాల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి

మొదటి తరువాయి

శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కరీంనగర్ నగరంలో ప్రధాన సమస్యగా ఉన్న డంప్ యార్డు అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యపై ఎవరూ అనవసర వివాదాలు సృష్టించవద్దని సూచించారు. అభివృద్ధి పనులకు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని, కాంట్రాక్టర్లను భయపెడితే పనులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. కరీంనగర్ పేరును దెబ్బతీసే రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు సహించరని, అభివృద్ధి పనులను అడ్డుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ డంప్ యార్డు సమస్య ఇప్పటిది కాదని, దీని పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కూడా హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు తావులేదన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఆ తర్వాత ప్రజా సంక్షేమమే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. నగర అభివృద్ధితో పాటు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కూడా త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ఈసీ కసరత్తు ముమ్మరం

న్యూఢిల్లీ

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తును ముమ్మరం చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే ఏడాది జనవరిలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. షెడ్యూల్ విడుదలకు ముందు ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఈసీ పూర్తిస్థాయి బెంచ్ పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కూడిన ఫుల్ బెంచ్ నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్‌లో ఆయా రాష్ట్రాల్లో పర్యటనలు ప్రారంభించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించనున్నారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను స్వీకరించనున్నారు. ఇప్పటికే డిప్యూటీ ఎన్నికల కమిషనర్ (డీఈసీ) స్థాయి బృందాలు పలు రాష్ట్రాల్లో పర్యటించి ఎన్నికల సన్నాహక పనులను సమీక్షించాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లో ఈ బృందాల పర్యటనలు పూర్తయ్యాయి. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఒక విడత పర్యటన ముగియగా, మరో రెండు పర్యటనలు జరగాల్సి ఉంది. గోవాలో మాత్రం డీఈసీ బృందం ఇంకా పర్యటించలేదు. ఈ బృందాలు నవంబర్ నెలాఖరులోగా తమ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించనున్నాయి. పోలింగ్‌ను ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై ఇప్పటివరకు చర్చ జరగలేదని తెలుస్తోంది. అయితే పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఒకే దశలో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

సంపాదకీయం


ధరల దరువు.. ముందుచూపు కరువు



ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేకపోవచ్చు కానీ తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం పాలకుల కనీస ధర్మం. ఏడేండ్ల క్రితం కరోనా ప్రపంచాన్ని వణికించింది. చిన్నపిల్లలు సైతం పిట్టల్లా రాలిపోతున్న రోజుల్లో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తన వయసును సైతం లెక్క చేయకుండా దవాఖానలకు వెళ్లి బాధితులను పరామర్శించి, తన మాటలతో ధైర్యం చెప్పేవారు. కానీ ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్ నినోపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి సైతం హాజరుకాలేనంత బిజీగా ఉన్నారు. సీఎం దవాఖానలకు వెళ్లి కరోనా బాధితులను పలకరించడమంటే అక్కడున్న కొద్దిమందికి ధైర్యం చెప్పడం కాదు. ఆ దృశ్యాలను టీవీల్లో చూసిన కోట్లాది మంది ప్రజలకు ధైర్యం వచ్చింది. దేశమంతా లాక్ డౌన్ అంటే ఎలాంటి కార్యకలాపాలు జరుగవు. దేశమే పూర్తిగా స్తంభించినప్పుడు ప్రభుత్వానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది. అలాంటి సంక్లిష్ట పరిస్థితిల్లో సైతం ప్రభుత్వ ఉద్యోగులకు కేసీఆర్ సగం జీతం చెల్లించారు. రేషన్ కార్డు ఉన్న ఒక్కో కుటుంబానికి 12 కిలోల బియ్యం, రూ.1,500 నగదు సహాయం అందించారు. వలస కూలీల ప్రాధాన్యతను గుర్తించి వారికి కూడా బియ్యం, నగదు సహాయం అందించారు. తెలంగాణ అభివృద్ధిలో వలస కూలీలు భాగస్వామ్యమేనని తలచి వారికీ ఈ సహాయం అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇక తెలంగాణలో ఎల్ నినో విషయానికి వస్తే అఖిలపక్ష సమావేశానికి సైతం ముఖ్యమంత్రి హాజరుకాలేదు. టీవీలో జరిగిన చర్చలో అఖిలపక్ష సమావేశానికి సీఎం హాజరుకాకపోవడాన్ని ప్రస్తావిస్తూ సీఎంకు అనేక ముఖ్యమైన పనులు ఉంటాయని కాంగ్రెస్ ప్రతినిధి సమర్థించారు. ఏ ప్రాజెక్ట్ ఏ పరీవాహక ప్రాంతానికి చెందినదో ముఖ్యమంత్రికి సరిగా తెలియదు. సీఎంకు మద్దతుగా మాట్లాడాలని ప్రయత్నించిన నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఒకరు భద్రాచలం వద్ద శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఉన్నదని మీడియా ముందు జ్ఞాన ప్రదర్శన చేశారు. ఇలాంటి నాయకత్వం అఖిలపక్ష సమావేశాల్లో పాల్గొన్న ఏమి మాట్లాడతారు, ఏమి నిర్ణయాలు తీసుకుంటారు. నాయకత్వానికి విషయ పరిజ్ఞానం లేనపుడు అధికారులు ఏం చేస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు ఇస్తే ఆ తీగలు బట్టలు ఆరేసుకోవడానికి పనికొస్తాయని 2004 ఎన్నికల్లో చంద్రబాబు చాలా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో గెలిచి సీఎం కాగానే వైఎస్‌ఆర్ ముఖ్యమంత్రిగా తొలి సంతకం ఉచిత విద్యుత్తుపైనే. బట్టలు ఆరేసుకోవలసి వస్తుందని నమ్మిన అధికారులే అప్పుడు నాయకత్వం మారగానే ఉచిత విద్యుత్తు అమలును చేసి చూపించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ 24 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఇచ్చి చూపించారు. రాష్ట్ర నేతలు వ్యవస్థకు నాయకత్వం వహిస్తారు. వ్యవస్థతో పనిచేయిస్తారు. అది నాయకత్వ ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం బూతులు తిట్టడమే తమ ప్రతిభగా భావిస్తున్నది. సమర్థులైన ఐఏఎస్ అధికారులు అసమర్థ నాయకత్వంలో పనిచేయలేక వెళ్లిపోతున్నారు. ఒకప్పుడు తెలంగాణ వస్తే ఐటీ రంగం ఏమవుతుందో అనే భయాలు ఉండేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఐటీ మంత్రిగా కేటీఆర్, ఐఏఎస్ అధికారిగా జయేష్ రంజన్ నాయకత్వంలో ఐటీ రంగంలో ఉమ్మడి రాష్ట్రంలో కన్నా వేగంగా అభివృద్ధి చెందింది. అలాంటి సమర్థుడైన అధికారి కూడా పనిచేయలేని పరిస్థితి ఇప్పుడు నెలకొన్నది. ఎల్ నినో ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారంటే 'వరి వేయం, ఏం జరిగినా బాధ్యత మాదే' అని రైతుల నుంచి అధికారులు అఫిడవిట్ తీసుకుంటున్నారు. అఫిడవిట్ ఇస్తేనే ఎరువులు, విత్తనాలు ఇస్తారట. కాళేశ్వరం మరమ్మతులు చేయడానికి మూడేండ్ల క్రితం ప్రాజెక్టు నిర్మించిన కంపెనీ ముందుకు వస్తే, ప్రాజెక్ట్ వల్ల రైతులకు కలిగే మేలు కన్నా మరమ్మతులు చేయకుండా అలాగే ఉంచడం వల్ల తమకు కలిగే రాజకీయ ప్రయోజనం ముఖ్యమని ప్రస్తుత పాలకులు భావించారు. మూడేండ్ల క్రితమే మరమ్మతులు పూర్తయి ఉంటే ఎల్ నినోను తెలంగాణ విజయవంతంగా ఎదుర్కొని ఉండేది. తెలంగాణ అంటే ఒకప్పుడు కరువుకు శాశ్వత చిరునామా అన్నట్టు ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో వరి పంటలో దేశంలోనే అత్యధికంగా పండించి రికార్డ్ సృష్టించింది. ఇప్పుడు పాలకులు తమ అసమర్థ నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు మరోసారి కరువును చూపిస్తున్నారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో 231 కరువు మండలాలను ప్రకటించింది అప్పటి కేసీఆర్ సర్కార్. కాంగ్రెస్ పాలనలో ఇప్పుడు మళ్లీ కరువు మండలాల జోరు పెరిగింది. తాజాగా 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చునని కేంద్రం ఏప్రిల్‌లోనే హెచ్చరించింది. అయినా ప్రభుత్వం మేల్కొనలేదు. కరువు వచ్చినా తెలంగాణపై ప్రభావం పడకూడదనే లక్ష్యంతో గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నది. ఎన్నికల ముందు కాళేశ్వరం పిల్లర్ కూలడం కాంగ్రెస్‌కు రాజకీయంగా ప్రయోజనం కలిగింది. కానీ మూడేండ్లయినా మరమ్మతు చేయకపోవడంతో కరువు దాపురించడంతో అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై మండిపడుతున్నారు. ఇల్లు కట్టినప్పుడు పగులు పడితే మరమ్మతు చేసుకోమా? కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎందుకు మరమ్మతు చేయరని సామాన్య రైతు సైతం ఇప్పుడు ప్రశ్నిస్తున్నాడు. రైతులు ప్రశ్నిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఎల్ నినో తెలంగాణ ప్రజలపై విశ్వరూపం చూపిస్తే, రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌కు విశ్వరూపం చూపిస్తారు.

మురసు తుఫాను తాకిడిలోనూ చెక్కు చెదరని ప్రకృతి వ్యవసాయ పంటలు...!





-రసాయన వ్యవసాయంతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో మెరుగైన పంటల నిలకడ

ఒంగోలు, ప్రకాశం బ్యూరో, నవంబర్ 9(మహాప్రభ)
ప్రకాశం జిల్లాలో నవంబర్ 3 వ తేదీన మురసు తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, గంటకు 100--110 కి.మీ. వేగంతో ఈదురు గాలులు నమోదయ్యాయి.ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. అయితే, ఇదే పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన మిరప, వరి పంటలు తుఫాను ప్రభావాన్ని తట్టుకుని నిలబడటం విశేషం.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ, రసాయన వ్యవసాయ క్షేత్రాల మధ్య పంటల నిలకడలో స్పష్టమైన వ్యత్యాసం క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి తెలిపారు.ముండ్లమూరు మండలం, పురుమెట్ల గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు కనుకు నాగ బ్రహ్మారెడ్డి తన రెండు ఎకరాల్లో 555 రకం మిరప పంటను సాగు చేయగా, మురసు తుఫాను తీవ్ర ప్రభావం చూపినప్పటికీ ఒక్క మొక్క కూడా నేలకొరగకుండా నిలబడింది. అదే గ్రామానికి చెందిన రసాయన వ్యవసాయ రైతు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి సాగు చేసిన తేజ రకం మిరప పంటలో సుమారు 40 శాతం మొక్కలు నేలకొరిగాయి. 5204 రకం వరి పంట తుఫాను ప్రభావాన్ని తట్టుకుని నిలబడింది అద్దంకి మండలం, చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ముచ్చిమూరి నరేంద్ర రెడ్డి తన ఒక ఎకరంలో సాగు చేసిన 5204 రకం వరి పంట తుఫాను ప్రభావాన్ని తట్టుకుని నిలబడింది. అదే గ్రామానికి చెందిన రసాయన వ్యవసాయ రైతు కె. అంజిరెడ్డి సాగు చేసిన రెండు ఎకరాల 5204 రకం వరి పంటలో సుమారు 70 శాతం పంట నేలకొరిగింది.ఒకే గ్రామంలో, ఒకే పంట రకాన్ని, ఒకే రకమైన వాతావరణ పరిస్థితుల్లో సాగు చేసినప్పటికీ, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పంటలు నిలకడగా ఉండటం, రసాయన వ్యవసాయ క్షేత్రాల్లో అధికంగా దెబ్బతినడం గమనార్హం. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించే పీఎమ్డీఎస్ వంటి పద్ధతుల ద్వారా నేల ఆరోగ్యాన్ని, పంటల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రైతులు కృషి చేస్తున్నారు. ఈ పద్ధతులు పంటల స్థిరత్వాన్ని, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడే అవకాశాలను ఈ క్షేత్రస్థాయి పరిశీలనలు తెలియజేస్తున్నాయి.వాతావరణ మార్పులు, తుఫానులు, భారీ వర్షాలు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న తరుణంలో, ముండ్లమూరు, అద్దంకి మండలాల్లోని ఈ క్షేత్రస్థాయి ఉదాహరణలు ప్రకృతి వ్యవసాయ పంటల నిలకడను చాటిచెబుతున్నాయి. రైతులకు పంట నష్టాలను తగ్గించుకునే స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకతను తెలియజేస్తూ, ప్రకృతి వ్యవసాయంపై మరింత నమ్మకాన్ని, భరోసాను కల్పిస్తున్నాయి.

ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం..

-ఇది సుపరిపాలనకు దక్కిన గౌరవం... సీఎం చంద్రబాబు

-స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి అఖండ విజయం

-ఇది తన ప్రభుత్వ సుపరిపాలనకు లభించిన ఆమోదమన్న సీఎం చంద్రబాబు

-2024 సాధారణ ఎన్నికల కంటే ఇప్పుడు ఆదరణ మరింత పెరిగిందని వెల్లడి

-అనేక జిల్లాల్లో వైసీపీకి ప్రజా మద్దతు పూర్తిగా కరవైందని వ్యాఖ్య



అమరావతి, నవంబర్ 9(మహాప్రభ)
ఏపీలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన అఖండ విజయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది తమ ప్రభుత్వ సుపరిపాలనకు, రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధికి ప్రజలు ఇచ్చిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "మంచి పరిపాలన మంచి రాజకీయాలకు దారితీస్తుంది (గుడ్ గవర్నెన్స్ లీడ్స్ టు గుడ్ పాలిటిక్స్)" అని తాను నిరంతరం విశ్వసిస్తానని, ఆ నమ్మకాన్ని ప్రజలు మరోసారి నిజం చేశారని అన్నారు.

కూటమికి ప్రజల ఆదరణ మరింతగా పెరిగిందన్న చంద్రబాబు
2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే, స్థానిక ఎన్నికల్లో కూటమికి ప్రజల ఆదరణ మరింతగా పెరిగిందని చంద్రబాబు విశ్లేషించారు. అదే సమయంలో వైసీపీని ప్రజలు మరింతగా తిరస్కరించారని స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా, వర్గాలకు అతీతంగా ప్రజలంతా కూటమి వైపే నిలిచారని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు.
ఓటింగ్ విధానం ఏదయినా.. ప్రజలు కూటమికే మద్దతు పలికారు ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా.. ప్రజలు కూటమికే మద్దతు పలికారని తెలిపారు. ముఖ్యంగా అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైసీపీకి ప్రజా మద్దతు పూర్తిగా కరవైందని ఆయన పేర్కొన్నారు.

విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యత
తుపాన్ల వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చిందని, తాము పడిన కష్టాన్ని ప్రజలు గుర్తించారని చంద్రబాబు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని అన్నారు.

ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా..
ఈ చారిత్రక విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని ఆయన వినమ్రంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు తమపై మరింత బాధ్యతను పెంచిందని, రాష్ట్ర అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు

శ్రీవారి భక్తులకు శుభవార్త..

- ఆన్‌లైన్‌లో టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీల బుకింగ్ ప్రారంభం

-టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా 2027 డైరీలు, -క్యాలెండర్ల ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం

-తిరుమల, తిరుపతి, తిరుచానూరు లోని 12 కౌంటర్ల లోనూ అందుబాటులో ప్రచురణలు

-హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ సహా ప్రధాన నగరాల్లోని టీటీడీ కేంద్రాల్లో విక్రయాలు

-గత సెప్టెంబరు 7న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరణ

-భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టీటీడీ ప్రజా సంబంధాల విభాగం విజ్ఞప్తి



తిరుమల, నవంబర్ 9(మహాప్రభ)
రాబోయే నూతన సంవత్సరం 2027ను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల కోసం ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతి ఏటా విశేష ఆదరణ పొందే టీటీడీ డైరీలు, క్యాలెండర్లను భక్తులు ఈసారి తమ ఇళ్ల నుంచే సులభంగా పొందేలా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని ప్రారంభించింది. శ్రీవారి భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ టీటీడీ దేవస్థానమ్స్.ఏపీ.జీవోవి.ఇన్ ద్వారా 2027 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు, డైరీలను నేరుగా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకోవచ్చని దేవస్థానం అధికారులు వెల్లడించారు.ఆన్‌లైన్ సదుపాయంతో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రత్యక్ష విక్రయ కేంద్రాలను కూడా టీటీడీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచింది. తిరుపతి, తిరుమల, తిరుచానూరు పరిధిలోని టీటీడీ ప్రచురణల విక్రయ విభాగానికి చెందిన 12 ప్రత్యేక కౌంటర్లలో వీటిని భక్తులు కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రధాన నగరాల్లోని భక్తుల కోసం స్థానిక టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ వీటి విక్రయాలు జరుగుతున్నాయి.
టీటీడీ సమాచార కేంద్రాల్లో ఈ క్యాలెండర్లు, డైరీలు లభ్యం
హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ కేంద్రాలతో పాటు విజయవాడ, చెన్నై, వెల్లూరు, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబై నగరాల్లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో ఈ క్యాలెండర్లు, డైరీలు లభ్యమవుతున్నాయి.కాగా, 2027 నూతన సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను 2026 సెప్టెంబరు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఆవిష్కరణ జరిగిన నాటి నుంచే ప్రత్యక్ష కేంద్రాల్లో వీటి విక్రయాలు వేగంగా సాగుతున్నాయి. భక్తుల నుంచి వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాజాగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని సైతం విస్తృతం చేశారు.
శ్రీవారి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి
శ్రీవారి భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని లేదా సమీపంలోని సమాచార కేంద్రాల వద్ద వీటిని కొనుగోలు చేయాలని టీటీడీ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

పేదల సొంతింటి కల సాకారం..

-ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో దీపావళి వెలుగులు





మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్ దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 9 మహాప్రభ

దేవరకద్ర: పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు నిరుపేద కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతున్నాయని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేపట్టిన సంకల్పం మరోసారి చర్చనీయాంశమైంది. దీపావళి పండుగ వేళ ఇందిరమ్మ ఇళ్ల ముందు దీపాలు వెలిగించి, ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్ల గుర్తింపు స్టిక్కర్లు అతికించడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ ఆనందం వెల్లివిరిసింది. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు చౌదర్పల్లి గ్రామంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. రెండో వార్డు కౌన్సిలర్ ఎరుకల భీమన్న ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి, ఇంటి ముందు ఇందిరమ్మ ఇళ్ల స్టిక్కర్లను అతికించారు. ఏళ్ల తరబడి సొంత ఇంటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఆశాజ్యోతులుగా నిలుస్తున్నాయని, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. దీపావళి వెలుగుల మధ్య సొంతింటి వద్ద దీపాలు వెలిగించుకోవడం లబ్ధిదారులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేసే దిశగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురుగునీటి మడుగు

-దుర్వాసన, దోమలతో ఎస్సీ వాడ కాలనీ ప్రజల అవస్థలు..

- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్ దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 9 మహాప్రభ

దేవరకద్ర: ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంతో దేవరకద్ర మున్సిపాలిటీలోని ఎస్సీ వాడ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీకి అతి సమీపంలో, ఎస్సీ వాడ నుంచి అమ్మాపూర్‌కు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురుగునీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు పేరుకుపోయిన చెత్తాచెదారం, విపరీతంగా పెరిగిన దోమలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అండర్ బ్రిడ్జి కింద మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమల బెడదతో రాత్రివేళ ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న మురుగునీరు, అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు వృద్ధి చెంది, ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలోనే ఈ దుస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు ఎవరివోనన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలి. అండర్ బ్రిడ్జి కింద నిలిచిన మురుగునీటిని తక్షణమే తొలగించి, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయడంతో పాటు మురుగునీరు మళ్లీ నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్సీ వాడ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఈ సమస్యపై అధికారులు ఇంకా ఎంతకాలం నిర్లక్ష్యం వహిస్తారోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతున్న రైతు వేదిక



చేర్యాల, నవంబర్ 9(మహాప్రభ)

రైతుల సౌకర్యార్థం నిర్మించిన చేర్యాల పట్టణంలోని రైతు వేదిక భవనం నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతోంది. భవనం లోపల ఫ్లోరింగ్ టైల్స్ కుంగిపోవడంతో పాటు పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రధాన ద్వారం వద్ద టైల్స్ పూర్తిగా దెబ్బతినగా, బయట కాంక్రీట్ మెట్లు, అరుగు పెచ్చులూడి అధ్వానంగా మారాయి. నిత్యం రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు రాకపోకలు సాగించే భవనం పరిస్థితిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి



బచ్చన్నపేట,నవంబర్ 9(మహాప్రభ)

:జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటనతో రైతు మాసపేట చంద్రారెడ్డి కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. పాడి ఆవుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తనకు ఆవు మృతి చెందడం తీరని ఆర్థిక నష్టాన్ని కలిగించిందని చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఘటనపై పరిశీలన జరిపి, తగిన నష్టపరిహారం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ లైన్‌మెన్ రాములు, క్షేత్రస్థాయి వెటర్నరీ అధికారి శ్రీనివాస్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతు తండ్రి శ్రీనివాస్‌రెడ్డితో పాటు రైతులు మల్లారెడ్డి, ముత్యంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుధాకర్, రాజిరెడ్డి తదితరులు అక్కడికి చేరుకుని బాధిత రైతును పరామర్శించారు.

మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

- ఉద్యోగ, ఉపాధి మార్గాల వైపు యువత పయనించాలి

-యువతకు ది మిషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ కొట్టే ఏడుకొండలు పిలుపు

-రామన్నపేట ఎస్సై గోపాతి సతీష్



రావన్నపేట నవంబర్ 9(మహాప్రభ)

డ్రగ్స్, గంజాయి, మద్యం, బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి సన్మార్గంలో పయనించాలని ది మిషన్ ఫౌండర్, ఎక్సైజ్ సీఐ కొట్టే ఏడుకొండలు యువతకు పిలుపునిచ్చారు.ముునిపంపుల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రామన్నపేట పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ వారి సహకారంతో "హలో యువత.. ఎటువైపు నీ భవిత!" అనే నినాదంతో గ్రామ యువతకు డ్రగ్స్, గంజాయి, మద్యం, బెట్టింగ్ తదితర వ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొట్టే ఏడుకొండలు మాట్లాడుతూ యువత దేశానికి,సమాజానికి భవిష్యత్తు ఆశాకిరణాలని, అలాంటి యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను అంధకారం చేసుకోవడం బాధాకరమన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలను, సామాజిక సంబంధాలను విచ్ఛిన్నం చేస్తుందని హెచ్చరించారు. రామన్నపేట ఎస్.ఐ గోపతి సతీష్ మాట్లాడుతూ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం వంటి వ్యసనాలకు అలవాటుపడి యువత ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను, కుటుంబ సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువత తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగం, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం గురించి తెలిసినప్పుడు పోలీస్, ఎక్సైజ్ శాఖల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ గ్రామ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలనే ఉద్దేశంతోనే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. యువత భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, ముునిపంపుల గ్రామాన్ని మత్తు పదార్థాలు, బెట్టింగ్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉన్న ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు.

"వ్యసనాలను వీడుదాం.. జీవితాలను నిర్మించుకుందాం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పోటీ పడదాం" అనే సందేశంతో యువతలో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై అరుణ్ కుమార్, గ్రామ ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతి కుమార్, విఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ రాంరెడ్డి, సామాజిక కార్యకర్త నీలం శేఖర్, ఉపాధ్యాయులు కుక్కడపు రమేష్, పాలకవర్గం సభ్యులు యాదాసు లక్ష్మణ్,మేకల రాములు,కునూరు లక్ష్మమ్మ,గంటెపాక శ్రీను, మేకల జలేందర్ మాజీ యంపిటిసి గాదె పారిజాత,గంటెపాక శివ కుమార్,వేముల సైదులు, బూరుగు గోపి కృష్ణ, తోలుపునూరి చంద్రశేఖర్,జితేందర్,ఉడుతల శ్రీనివాస్,ఏలూరి అనిత,బాదే మంజుల,యాదాసు శోభ, బూడిద మారయ్య తదితరులు పాల్గొన్నారు.

బతికున్న వారికి నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు జారీ

-రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నిర్వాకం

-ఇద్దరిపై కేసు నమోదు

-చేర్యాల ఎస్ ఐ అపూర్వ రెడ్డి



చేర్యాల, నవంబర్ 9(మహాప్రభ)

బతికున్న వ్యక్తులను మరణించినట్లుగా చూపిస్తూ నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేసిన ఘటన చేర్యాల మండలంలో కలకలం రేపింది. ఈ వ్యవహారంలో రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య మధుతో పాటు ఓ ప్రైవేట్ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.చేర్యాల ఎస్ ఐ అపూర్వ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య మధు తన వద్ద ఉండాల్సిన ఈ-సైన్ డాంగిల్ కీని అదే గ్రామానికి చెందిన శెవల్ల రమేష్ అనే ప్రైవేట్ వ్యక్తికి అప్పగించాడు. రమేష్ హైదరాబాద్‌లో ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ డాంగిల్ కీని ఉపయోగించి ఫిబ్రవరి 2026 నుంచి సెప్టెంబర్ 2026 వరకు బతికున్న వ్యక్తుల పేర్లపై మొత్తం 22 నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేసినట్లు విచారణలో గుర్తించారు.ఈ వ్యవహారంపై కలెక్టర్ ఆదేశాల మేరకు చేర్యాల ఎంపీఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పంచాయతీ కార్యదర్శి భూక్య మధు, ప్రైవేట్ వ్యక్తి శెవల్ల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ అపూర్వ రెడ్డి వెల్లడించారు.

మేకల అభినవ్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా మునాస కృష్ణయ్య.. జనరల్ సెక్రటరీగా పాలడుగు నాగార్జున

నల్గొండ, నవంబర్ 9(మహాప్రభ)

నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్‌లో సుమారు 170 మంది సభ్యులు ఉండగా, వారి భాగస్వామ్యంతో 21 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా మునాస కృష్ణయ్య, జనరల్ సెక్రటరీగా పాలడుగు నాగార్జున, ట్రెజరర్‌గా కాటిక వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్, ఎండీ జమాల్, కత్తుల తులసీదాసు, గట్టు కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పంగా నాగరాజు, ముత్యాల సర్వే గౌడ్, తోనుపునూరి ప్రభాకర్ గౌడ్, రాసమల్ల శేఖర్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా పేరుపి ప్రభాకర్ రావు, కరాకంటి జానయ్య, కత్తుల శివరాజ్ బాధ్యతలు చేపట్టారు. ఆడిట్ కమిటీ సభ్యులుగా తెల్ల మేకల శ్రీనివాస్, రావుల కోటేష్, కందుల అశోక్ ఎన్నికయ్యారు. మరో 21 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మునాస కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ పాలడుగు నాగార్జున మాట్లాడుతూ.. వాకర్స్ ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్య, క్రీడలు, ఆటపాటలు, ఆత్మీయ సమ్మేళనాలు, సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. స్టేడియం పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. మేకల అభినవ్ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేయడమే నూతన కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, మంచినీటి సౌకర్యం, జిమ్ ఏర్పాటు, వాకర్స్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్టేడియాన్ని కేవలం వాకింగ్‌కు మాత్రమే పరిమితం చేయకుండా ఆరోగ్యం, ఆహ్లాదం, ఐక్యత, సామాజిక చైతన్యానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సభ్యులందరి సహకారంతో ముందుకు సాగుతామని నూతన కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.



ముఖ్యమంత్రి సభకు తరలివెళ్లిన ఖేడ్ రైతులు



నారాయణఖేడ్,నవంబర్ 9(మహాప్రభ)

మహబూబ్ నగర్ జిల్లా కొడంగల్ లో నిర్వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభకు నారాయణఖేడ్ నుండి 8 బస్సులలో రైతులు తరలివెళ్లారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల శేఖర్ రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ లు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,పార్టీ అధ్యక్షులు,రైతులు,వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాలో పేరు గల్లంతైన అర్హులైన ఓటర్లకు మరో అవకాశం

-అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు

-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా -09నవంబర్ (మహాప్రభ).

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (యస్ ఐ ఆర్)-2026లో భాగంగా గైర్హాజరు వలస వెళ్లిన మరణించిన డూప్లికేట్ గా గుర్తించి, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు చేర్చని అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్‌లి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత ఓటర్లు తమ వివరాలతో కూడిన ఎలక్ట్రోరల్ ఫారాలను తిరిగి పూరించి, సంబంధిత బి యల్ ఓ కు సమర్పించాలన్నారు. గైర్హాజరు, వలస, మరణం, డూప్లికేట్‌గా గుర్తించినప్పటికీ ఎలక్ట్రోరల్ ఫారాలు అందని ఓటర్ల బూత్‌వారీ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో ఉన్నట్లయితే, గతంలో ఎలక్ట్రోరల్ ఫారం సమర్పించకపోవడానికి గల కారణాలను పేర్కొంటూ, నిర్దేశిత అనుబంధం-ప్రకటనతో పాటు పూర్తి చేసిన, సంతకం చేసిన ఫారాన్ని సంబంధిత ఈఆర్ ఓ //బి యల్ ఓ కు స్వయంగా (లేదా) కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా అందజేయవచ్చన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడడంతో పాటు, డూప్లికేట్ ఓటరు నమోదుకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టిపిసిసి సభ్యులు డా.దూదిపాల వేణుధర్ రెడ్డి.



దేవరకొండ నవంబర్ 9 (మహాప్రభ)

కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు, కొండమల్లేపల్లి పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ

మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్‌ను ఘనంగా సన్మానించిన బీఎన్ రెడ్డి లైఫ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం



దేవరకొండ నవంబర్ 9(మహా ప్రభ)

హైదరాబాద్‌లోని బీఎన్ రెడ్డి లైఫ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం రవీంద్ర కుమార్ కి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించింది. అనంతరం పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని కొద్దిసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఎన్ రెడ్డి లైఫ్ కేర్ హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ బస్సుకు తప్పిన ఘోర ప్రమాదం

-పాలంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు





గాంధారి నవంబర్ 9 (మహాప్రభ)

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుడిమెట్ శివారులో సోమవారం ఆర్టీసీ బస్సుకు ఘోర ప్రమాదం తప్పింది. అదుపుతప్పి బస్సు, కారు పంట పొలాల్లోకి దూసుకెళ్లాయి.సోమవారం ఉదయం కామారెడ్డి నుండి బాన్సువాడకు 16 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు గుడిమెట్ శివారు ప్రాంతానికి రాగానే, బస్సు వెనుకాలే వస్తున్న కారు బస్సును ఓవర్ టేక్ చేయబోగా బస్సుకు కొద్దిగా తగిలింది. దీంతో రెండు వాహనాలు రోడ్డు కిందికి దూసుకెళ్లాయి.ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కామారెడ్డి ఆర్టీసీ డీఎం ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కండక్టర్, ప్రయాణికుల ఫోన్ నంబర్లు తీసుకుని ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు.ఆర్టీసీ బస్సు డ్రైవర్ రాజు తప్పు లేదని బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తెలిపారు. బస్సులో ప్రయాణిస్తున్న 16 మందిలో ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తొర్రూరుకు చెందిన వ్యక్తి మృతి

-గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు..

ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి





పెద్దవంగర నవంబర్ 09 (మహాప్రభ)

తొర్రూరు గ్రామానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పెద్దవంగర మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు గ్రామానికి చెందిన శివరాత్రి నాగవద్దిరాజు (43) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన తొర్రూరుకు హోండా షైన్ ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 12:30 గంటల సమయంలో తొర్రూరు-తిరుమలగిరి ప్రధాన రహదారి (చీఎ-930-స్రా)పై వడ్డెకొత్తపల్లి గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకోగానే, తన ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగవద్దిరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య శివరాత్రి హైమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దవంగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోతుల బెడదతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు

-తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలి

-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ



దేవరకొండ నవంబర్ 9 (మహాప్రభ)

దేవరకొండ పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు.సోమవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ....పట్టణంలోని పలు కాలనీలు, వీధుల్లో కోతులు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడటం, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఇంటి పరిసరాల్లో వస్తువులను చిందరవందర చేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. కోతుల దాడుల వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, కోతుల బెడదను నివారించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి, పట్టణంలోని అన్ని కాలనీల్లో కోతులను నియంత్రించే చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని దేవరకొండ పట్టణాన్ని కోతుల బెడద నుంచి విముక్తి చేయాలని, సమస్యను నిర్లక్ష్యం చేయకుండా మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.

వాగులో ఇసుక మాఫియా అక్రమ దందా!





-గ్రామస్తుల చేతికి చిక్కిన టిప్పర్, ట్రాక్టర్..

రెవెన్యూ అధికారులకు అప్పగింత

మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్ దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 9 మహాప్రభ

పేరూరు: ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో పంటలు పండక, సాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మరోవైపు ఇసుక మాఫియా అక్రమ దందాకు తెరలేపింది. ప్రకృతి వైపరీత్యాలతో కష్టాల్లో ఉన్న ప్రజల పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోకుండా గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడుతున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం, కౌకుంట్ల మండలం పేరూరు గ్రామంలో వెలుగుచూసింది.

గ్రామ శివారులోని వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమైన గ్రామస్తులు అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఇసుక తరలింపునకు ఉపయోగిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు.


సమాచారం అందుకున్న తహసీల్దార్ సుందర్‌రాజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) స్పందించగా, గ్రామస్తులు పట్టుకున్న టిప్పర్, ట్రాక్టర్‌ను అధికారులకు అప్పగించారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి గ్రామ శివారులోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడుతున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా సహజ వనరులను కొల్లగొడుతున్న ఇసుక అక్రమార్కులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్..

ప్రజల నుంచి స్పందన కరువు

మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్ దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 9 మహాప్రభ

దేవరకద్ర: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈ సోమవారం ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం దరఖాస్తులు లేకుండానే ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమకు ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర వినతులను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ నవంబర్ 9(మహాప్రభ)

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ , నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత కాలం కొనసాగుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తన సేవలను అందించాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రికి జన్మదిన మరియు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

బిజినెస్

భారీగా పెరిగిన బంగారం ధరలు

-24 క్యారెట్ల 10 గ్రాములపై రూ.1,030 పెరుగుదల
-రూ.1,44,600కు చేరిన పసిడి ధర
-22 క్యారెట్ల బంగారంపై రూ.950 పెరుగుదల
-రూ.1,32,550 పలుకుతున్న 22 క్యారెట్ల ధర
-కిలో వెండి ధరలో మాత్రం మార్పులేదు
-హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పెరిగిన పసిడి ధరలు
-కొనుగోలుదారులపై మరింత పెరిగిన భారం



హైదరాబాద్:
బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ధరల పెరుగుదల మరోసారి భారంగా మారింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం పసిడి ధరలు భారీగా ఎగబాకాయి. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,030 పెరగడంతో రూ.1,44,600కు చేరింది. అదేవిధంగా ఆభరణాల తయారీలో ఎక్కువగా ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది. 10 గ్రాములపై రూ.950 పెరుగుదలతో రూ.1,32,550కు చేరుకుంది. ఇటీవలి కాలంలో బంగారం ధరల్లో చోటుచేసుకుంటున్న మార్పులు కొనుగోలుదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ధరలు పెరిగిన ప్రతిసారీ ఆభరణాల కొనుగోలుకు వెచ్చించాల్సిన మొత్తం కూడా పెరుగుతోంది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న కుటుంబాలపై ఈ పెరుగుదల ప్రభావం చూపుతోంది. గతంలో నిర్ణయించుకున్న బడ్జెట్‌లోనే ఆభరణాలు కొనుగోలు చేయడం కష్టంగా మారుతోంది. ధరలు మరింత పెరుగుతాయనే ఆందోళనతో కొందరు కొనుగోళ్లను వాయిదా వేసుకునే పరిస్థితి కూడా కనిపిస్తోంది. మరోవైపు వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,05,000 వద్ద ఎలాంటి మార్పు లేకుండా ఉంది. బంగారం ధరలు పెరిగినప్పటికీ వెండి ధరలో మార్పు లేకపోవడం కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. అయితే బంగారం, వెండి ధరలు ప్రాంతాలను బట్టి స్వల్పంగా మారవచ్చు. కొనుగోలు చేసే సమయంలో స్థానిక బులియన్ మార్కెట్‌లోని తాజా ధరలను తెలుసుకోవడం అవసరం. బంగారం ధరల పెరుగుదలతో పసిడి కొనుగోళ్లపై వినియోగదారుల వ్యయం మరింత పెరగనుంది.

క్యాన్సర్ మందుల ధరలు తగ్గింపు.. నేటి నుంచే అమలు

-1,364 క్యాన్సర్ ఔషధాల ధరలకు కోత
-నవంబర్ 9 నుంచి కొత్త ధరలు అమల్లోకి
-679 బ్రాండ్ల ధరలు 50 శాతానికి పైగా తగ్గింపు
-ఔషధాల గరిష్ఠ చిల్లర ధరలపై కేంద్రం కీలక నిర్ణయం
-సవరించిన కనీస ధరల జాబితా అమల్లోకి
-రోగులపై చికిత్స ఖర్చుల భారం తగ్గించే చర్య
-ఎంఆర్‌పీల్లో 96.45 శాతం వరకు తగ్గింపు



న్యూఢిల్లీ:
క్యాన్సర్ రోగులకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే ఔషధాల ధరలను తగ్గిస్తూ సవరించిన ధరల జాబితాను అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో మొత్తం 1,364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలు తగ్గాయి. నవంబర్ 9 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. కొత్త ధరల విధానంలో భాగంగా 679 బ్రాండ్ల ఔషధాల ధరలను 50 శాతానికి మించి తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఔషధాల గరిష్ఠ చిల్లర ధరల్లో (ఎంఆర్‌పీ) 96.45 శాతం వరకు తగ్గింపు నమోదైనట్లు స్పష్టం చేసింది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే మందులు అధిక ధరల్లో లభిస్తుండటంతో రోగులు, వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఔషధాల ధరలను తగ్గించడం ద్వారా చికిత్స వ్యయాన్ని కొంతమేర తగ్గించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. క్యాన్సర్ చికిత్సలో మందుల వినియోగం దీర్ఘకాలం కొనసాగాల్సి రావడంతో వాటి ధరలు రోగుల కుటుంబాలపై గణనీయమైన ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ముఖ్యంగా ఖరీదైన ఔషధాలను క్రమం తప్పకుండా కొనుగోలు చేయాల్సిన వారికి ధరల తగ్గింపు ప్రయోజనం కలిగించనుంది. సవరించిన ధరలు అమల్లోకి రావడంతో ఆయా బ్రాండ్ల మందులను కొత్త ధరలకే విక్రయించాల్సి ఉంటుంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో క్యాన్సర్ చికిత్స మరింత అందుబాటులోకి వస్తుందని, రోగులకు ఆర్థికంగా కొంత ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు.

ఎనిమిది నెలల గరిష్ఠానికి స్టాక్ మార్కెట్లు

-లాభాలతో ముగిసిన దేశీయ సూచీలు
-107.25 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
-81,106.65 వద్ద ముగిసిన సెన్సెక్స్
-58.25 పాయింట్లు ఎగబాకిన నిఫ్టీ
-25,044.65 స్థాయికి చేరిన నిఫ్టీ
-ఎనిమిది నెలల గరిష్ఠ స్థాయిలో సూచీలు
-మదుపరుల్లో ఉత్సాహం నింపిన మార్కెట్ లాభాలు



ముంబై
దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. కీలక సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ పుంజుకోవడంతో మార్కెట్లు ఎనిమిది నెలల గరిష్ఠ స్థాయికి చేరాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 107.25 పాయింట్లు లాభపడి 81,106.65 వద్ద ముగిసింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 58.25 పాయింట్లు పెరిగి 25,044.65 స్థాయికి చేరుకుంది. ఇటీవలి మార్కెట్ కదలికల నేపథ్యంలో సూచీలు లాభాల్లో ముగియడం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ కీలక స్థాయిలను అధిగమించడంతో మార్కెట్ వర్గాల్లో సానుకూల వాతావరణం కనిపించింది. ఎనిమిది నెలల గరిష్ఠానికి సూచీలు చేరడం దేశీయ మార్కెట్లలో కొనుగోళ్ల ఆసక్తిని సూచిస్తోంది.

స్పోర్ట్స్

టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన బంగ్లా బ్యాటర్ ముష్ఫికర్..!



బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో 7000 పరుగులు పూర్తిచేసిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్‌గా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వెస్టిండీస్ తో సిల్హెట్ వేదికగా ఈరోజు ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో ముష్ఫికర్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టుకు దూరంగా ఉన్న 39 ఏళ్ల ముష్ఫికర్.. రెండో టెస్టులో బరిలోకి దిగాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అతను 7000 పరుగుల మార్క్‌కు 43 పరుగుల దూరంలో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగులు చేసి అవుటయ్యాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మ్యాచ్ ఐదోరోజు ఆటలో భాగంగా రోస్టన్ చేజ్ బౌలింగ్‌లో ఒక సింగిల్ తీసి 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఈ చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో 49 పరుగులు చేసి అతను నాటౌట్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగుల లక్ష్యఛేదనలో 184/4 స్కోరు వద్ద ఉండగా వెలుతురు మందగించడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. దాంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. బంగ్లాదేశ్ తరఫున టెస్టుల్లో 5000, 6000 పరుగుల మైలురాళ్లను కూడా తొలుత అందుకున్నది ముష్ఫికర్ రహీమే కావడం గమనార్హం. ప్రస్తుతం రహీమ్ 7000 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. రెండో స్థానంలో ఉన్న మోమినుల్ హక్ (5293) కంటే 1747 పరుగులు, ఇప్పటికే రిటైరైన తమీమ్ ఇక్బాల్ (5134) కంటే 1906 పరుగులు ఆధిక్యంలో రహీమ్ కొనసాగుతున్నాడు. 2005లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేట్రం చేసిన ముష్ఫికర్ రహీమ్, బంగ్లాదేశ్ తరఫున అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాడిగానూ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు 107 టెస్టులు ఆడిన అతను, దేశం తరఫున 100 టెస్టులు పూర్తి చేసిన ఏకైక ఆటగాడు. ఇప్పటికే వన్డే, టీ20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన ముష్ఫికర్ కేవలం టెస్టు క్రికెట్‌లో మాత్రమే బంగ్లాదేశ్‌కు తన సేవలు అందిస్తున్నాడు.

దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళా క్రికెట్ జట్టు..

-డిసెంబర్ 9న టూర్ షురూ..!



టెస్టు జట్టు : స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ సత్ఘరే.
వన్డే జట్టు : స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ.
టీ20 జట్టు : స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలివర్మ (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి కమలిని (వికెట్ కీపర్), అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలీ.
టూర్ షెడ్యూల్
డిసెంబర్ 9 -- ఏకైక టెస్టు
డిసెంబర్ 16 -- తొలి వన్డే
డిసెంబర్ 19 -- రెండో వన్డే
డిసెంబర్ 22 -- మూడో వన్డే
డిసెంబర్ 26 -- తొలి టీ20
డిసెంబర్ 29 -- రెండో టీ20
డిసెంబర్ 30 -- మూడో టీ20

న్యూజిలాండ్‌తో మూడో వన్డేకు భారత్ సిద్ధం!

-ఐదు వన్డేల సిరీస్‌లో 2--0తో ఆధిక్యంలో టీమిండియా
-నవంబర్ 10న మూడో వన్డే పోరు
-హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా మ్యాచ్
-తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ భారత జట్టుదే విజయం
-మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలని లక్ష్యం



న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భారత జట్టు విజయాల పరంపర కొనసాగిస్తోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ సమష్టిగా రాణించిన టీమిండియా వరుస విజయాలను నమోదు చేసి 2--0తో ఆధిక్యంలో నిలిచింది. దీంతో సిరీస్ కైవసం చేసుకునేందుకు భారత్‌కు మరో విజయం మాత్రమే అవసరమైంది. ఈ నేపథ్యంలో మూడో వన్డేకు భారత జట్టు పూర్తి స్థాయిలో సిద్ధమవుతోంది. నవంబర్ 10న హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో వన్డే జరగనుంది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ సొంతం చేసుకుంటుంది. అందుకే ఈ పోరును టీమిండియా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో సాధించిన విజయాలతో జట్టులో ఆత్మవిశ్వాసం పెరిగింది. అదే జోరును మూడో మ్యాచ్‌లోనూ కొనసాగించాలని ఆటగాళ్లు భావిస్తున్నారు. మరోవైపు న్యూజిలాండ్ జట్టుకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైన ఆ జట్టు సిరీస్‌లో ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. సొంత పరిస్థితులను అనుకూలంగా మలుచుకుని భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని కివీస్ జట్టు భావిస్తోంది. దీంతో హామిల్టన్ వేదికగా జరిగే మూడో వన్డే ఇరు జట్లకు కీలకంగా మారింది. భారత జట్టు సిరీస్‌ను ముందుగానే కైవసం చేసుకుంటుందా? లేక న్యూజిలాండ్ తిరిగి పోటీలోకి వస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

సూపర్ న్యాచురల్ హార్రర్ థ్రిల్లర్ 'డెమోంటే కాలనీ 3' ఆన్ ది వే



తెలుగులో రిలీజై మంచి టాక్ తెచ్చుకున్న తమిళ ఫ్రాంచైజీల్లో ఒకటి 'డెమోంటే కాలనీ '. ఆర్ అజయ్ జ్ఞానముత్తు రచన, దర్శకత్వంలో ఇప్పటికే డెమోంటే కాలనీ 2 కూడా వచ్చిందని తెలిసిందే. ఇప్పుడిక థర్డ్ పార్ట్ టైం వచ్చేసింది. సూపర్ న్యాచురల్ హార్రర్ థ్రిల్లర్‌గా రాబోతున్న డెమోంటే కాలనీ 3 విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్.ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. అరుల్ నిధి లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ మూవీ పలు వాయిదాల తర్వాత ఫైనల్‌గా 2027 పొంగళ్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. థర్డ్ పార్ట్‌లో అర్చనా రవిచంద్రన్ మీనాక్షి గోవింద రాజన్‌తోపాటు ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మూవీ ప్రమోషన్స్ త్వరలోనే షురూ కానున్నాయి. 2015లో చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకుంది డెమోంటే కాలనీ. మళ్లీ 8 ఏండ్ల తర్వాత వచ్చిన సీక్వెల్ పార్ట్‌లో అరుణ్‌పాండి

'కాకా' నుంచి ఊచకోత పోస్టర్

చిరంజీవి చేతిలో కొడవలి, రక్తంతో తడిసిన ఆయుధం..



మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు మరో మాస్ ట్రీట్ వచ్చేసింది. చాలా కాలం తర్వాత చిరంజీవిని పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో చూపించేందుకు దర్శకుడు బాబీ కొల్లి సిద్ధమవుతున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాకా' ఇప్పటికే మంచి అంచనాలను ఏర్పరచుకుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, మరోవైపు ప్రమోషన్లను కూడా మేకర్స్ జోరుగా కొనసాగిస్తున్నారు. తాజాగా దీపావళి పండుగను పురస్కరించుకుని విడుదల చేసిన స్పెషల్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీపావళి సందర్భంగా 'కాకా' చిత్రబృందం విడుదల చేసిన పోస్టర్ మెగా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌లో చిరంజీవి ఒక పంట పాలంలో నిలబడి చేతిలో కొడవలి పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన ముఖంలో కోపం, చూపుల్లో తీవ్రత కనిపిస్తుండగా.. చేతిలో ఉన్న కొడవలికి రక్తపు మరకలు ఉండటం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది.ఈ పోస్టర్‌కు మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ కూడా అదిరిపోయేలా ఉంది. "ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు.. టపాసులు సంక్రాంతికి కలుద్దాం" అంటూ అభిమానులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా, "సంక్రాంతి పండగకి ఈసారి.. పంటకి కోత, బాక్సాఫీస్‌కి ఊచకోత" అంటూ మరో మాస్ డైలాగ్‌తో సినిమాపై అంచనాలను పెంచేశారు. ఈ పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో చిరంజీవి పాత్ర ఎంతటి పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన చేతిలోని కొడవలి, రక్తంతో కూడిన లుక్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ సినిమాలో చిరంజీవి కదిరి కాళిదాస్ అనే పాత్రలో కనిపించనున్నారు. అయితే సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్ సమయంలో మాత్రం ఆయనను ఆక్వా కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే సత్యం పాత్రలో పరిచయం చేశారు. ఆ సాధారణ వ్యక్తి వెనుక బలమైన గతం ఉందనే విషయాన్ని అప్పుడే హింట్ ఇచ్చారు. ఇప్పుడు విడుదలైన దీపావళి పోస్టర్ చూస్తుంటే ఆయన గతం ఎంతటి రక్తసిక్తమైనదో అనే ఆసక్తి కలుగుతోంది. అసలు సత్యం ఎవరు? కదిరి కాళిదాస్‌కు ఆయనకు ఉన్న సంబంధం ఏమిటి? ఆయన గతంలో ఎలాంటి పోరాటం చేశారు? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. చిరంజీవి పాత్రలో రెండు విభిన్న కోణాలు ఉండబోతున్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. 'కాకా' సినిమాలో చిరంజీవి కుమార్తె పాత్రలో మలయాళ నటి అనశ్వర రాజన్ నటిస్తున్నారు. అలాగే నివేదా పేతురాజ్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన పాత్రలు, బలమైన కథాంశంతో ఈ సినిమాను దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. సంక్రాంతి సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ సినిమాను భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

నెట్‌ఫ్లిక్స్‌లోకి విజయ్ దేవరకొండ, రష్మిక 'రణబాలి'..

-ఐదు భాషల్లో ఓటీటీ స్ట్రీమింగ్, రిలీజ్ డేట్ ఫిక్స్!



టాలీవుడ్‌లో క్రేజీ కపుల్‌గా గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన తాజా చిత్రం 'రణబాలి'. వీరిద్దరూ జంటగా నటించిన తొలి సినిమా కావడంతో విడుదలకు ముందే ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ విడుదలకు సంబంధించి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఎన్ని భాషల్లో స్ట్రీమింగ్ కానుందో కూడా వెల్లడించింది. దీంతో థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'రణబాలి' నవంబర్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్లు సమాచారం బయటకు వచ్చింది. తాజాగా స్ట్రీమింగ్ తేదీని కూడా ఖరారు చేయడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.థియేటర్లలో విడుదలైన తర్వాత ఓటీటీలోకి వస్తున్న ఈ సినిమాను ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి చూసేందుకు ప్రేక్షకులు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా విజయ్, రష్మిక జంటను ఒకే సినిమాలో చూడాలనుకునే అభిమానులకు ఇది మంచి అవకాశంగా చెప్పొచ్చు.'రణబాలి' ఓటీటీ విడుదలకు సంబంధించి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ఈ సినిమా కేవలం తెలుగులోనే కాకుండా మొత్తం ఐదు భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన వివరాల ప్రకారం తెలుగు ఒరిజినల్ వెర్షన్‌తో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులతో పాటు ఇతర భాషల సినీ అభిమానులు కూడా ఈ సినిమాను చూసే అవకాశం ఉంటుంది. విజయ్ దేవరకొండకు తెలుగు ప్రేక్షకుల్లోనే కాకుండా ఇతర భాషల్లోనూ మంచి క్రేజ్ ఉంది. అలాగే రష్మిక మందన్నకు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఐదు భాషల్లో స్ట్రీమింగ్ చేయాలనే నిర్ణయం సినిమాకు మరింత ప్రేక్షకాదరణ తీసుకొచ్చే అవకాశం ఉంది. 'రణబాలి' సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ స్థాయిలో నిర్మించారు. థియేటర్లలో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.80 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఇప్పుడు ఓటీటీలో విడుదల కావడంతో మరింత మంది ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది.



పుత్తడి బొమ్మలా మారిన శ్రీలీల...

ఇండస్ట్రీలోకి రాకముందే ముక్కుకు సర్జరీ చేయించుకున్నా..

-ఆసక్తికర విషయాలు బయటపెట్టిన జాన్వీ కపూర్!

బాలీవుడ్ అందాల తార, దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సినిమాల్లోకి రావడానికి ముందు తన తల్లి శ్రీదేవి పెట్టిన కండిషన్లు, ఆమె ఇచ్చిన సలహాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేకాదు.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ముందే తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. తొలుత తాను సినిమాల్లోకి వస్తానంటే తల్లి శ్రీదేవి పెద్దగా ఆసక్తి చూపించలేదని, అయితే ఆ తర్వాత తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధం గురించి ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో మాట్లాడుతూనే ఉంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా తన కెరీర్‌కు సంబంధించి తల్లి ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. తాను సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ విషయాన్ని మొదట శ్రీదేవికి చెప్పానని, అయితే ఆమె వెంటనే అంగీకరించలేదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం అంటే సాధారణ విషయం కాదని, ఈ రంగంలోకి వస్తే జీవితాంతం నటనకే అంకితం కావాల్సి ఉంటుందని తన తల్లి చెప్పినట్లు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, పూర్తి నిబద్ధతో పనిచేయాల్సి ఉంటుందని శ్రీదేవి తనకు వివరించినట్లు చెప్పారు. మొదట్లో తనపై తల్లికి అంతగా నమ్మకం ఉండేది కాదని కూడా జాన్వీ పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో జాన్వీ చెప్పిన మరో విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల్లోకి రావడానికి ముందు తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. తన తల్లి సూచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఆ తర్వాతే తనలో నటిగా కొనసాగగల లక్షణాలు ఉన్నాయని శ్రీదేవి భావించినట్లు చెప్పుకొచ్చారు. అయితే జాన్వీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె అందం, సినీ రంగ ప్రవేశానికి ముందు చేసిన మార్పుల గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఇప్పటికే పలుమార్లు తన వ్యక్తిగత రూపం, అందం గురించి జాన్వీ బహిరంగంగా మాట్లాడారు. అందం విషయంలో ఇతరులతో పోల్చుకోవడం సరికాదని, సోషల్ మీడియాలో కనిపించే అందమైన చిత్రాలను చూసి యువతులు తమను తాము తక్కువగా భావించుకోవద్దని సూచించారు.తన వ్యక్తిత్వం, అందం, కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాల్లో తల్లి ప్రభావం ఉందని జాన్వీ గతంలోనూ వెల్లడించారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com